• తాగునీరు వృథా



మిషన్ భగీరథ పైప్‌లైన్ పగలడంతో వృథాగా వెళ్తున్న తాగునీరు

నారాయణఖేడ్: పట్టణంలోని పంచగామ కమాన్ సమీపంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ మంగళవారం ఉదయం పగిలింది. దీంతో తాగునీరంతా ఖేడ్–రాయిపల్లి రహదారిపై వృథాగా పారుతోంది. పైప్‌లైన్ పగలడంతో మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలకు తాగునీరు అందకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని బసవేశ్వర, శివాజీచౌక్ వద్ద సైతం వారం రోజులుగా మిషన్ భగీరథ పైపులైన్లు లీకవుతూ నీరు వృథాగా పోతోంది. మున్సిపాలిటీ అధికారులు వెంటనే స్పందించి నీటి వృథాను అరికట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

• గుంతలమయంగా రహదారి



దెబ్బతిన్న జహీరాబాద్ - తాండూరు రోడ్డు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్– తాండూరు రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జహీరాబాద్–తాండూర్ రోడ్డు మండలంలోని మల్‌చెల్మ, శేఖాపూర్ గ్రామాల మీదుగా వెళ్తుంది. రాష్ట్ర సరిహద్దు కర్ణాటకలోని పలు గ్రామాల ప్రజలు కూడా ఇదే రహదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా పట్టణంలోని రాంనగర్, హోతి(కె) గ్రామాల వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా తయారైంది. అర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

• కృతజ్ఞత సభ



సంగారెడ్డి ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్‌ను గెలిపించినందుకు జీఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో కృతజ్ఞత సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. – సంగారెడ్డి

క్లుప్తంగా

ఎమ్మెల్యే 'చింతా'కు సన్మానం



ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను సన్మానించిన సరస్వతి శిశుమందిర్ పాఠశాల కమిటీ సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల కమిటీ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సరస్వతి శిశు మందిర్ కమిటీ అధ్యక్షుడు అమ్రాది రాచప్ప, ఉపాధ్యక్షుడు తాటికొండ వైద్యనాథ్, కార్యదర్శి సరాప్ శ్రీనివాస్, కోశాధికారి బరాడి తిరుపతి, పాఠశాల ప్రధానాచార్యులు తమ్మలి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో శిక్షణ

నారాయణఖేడ్: విద్యాశాఖ ప్రణాళికలో భాగంగా ఖేడ్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం కరాటే మాస్టర్ ఎండీ.మీరన్ కరాటేలో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా మెలకువలను నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం ప్రతిఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం మన్మథ కిషోర్, పీఈటీ మారుతి శిక్షణను పర్యవేక్షించారు.

శివలింగానికి రుద్రాభిషేకం

మునిపల్లి(అందోల్): సంగారెడ్డి జిల్లా అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో భ్రమరాంబ మల్లికార్జున దేవాలయంలో శివలింగానికి మంగళవారం మహాన్యాక పూర్వ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అర్చక పురోహిత గౌరవ అధ్యక్షుడు అయ్యప్పస్వామి, ప్రధాన కార్యదర్శి అడివయ్య, కోశాధికారి శివప్రసాద్, శంబులింగం, నాగేశ్, నరేశ్, మల్లన్న పాల్గొన్నారు.

నేడు విద్యా నాయకత్వ సమ్మేళనం

పటాన్‌చెరు టౌన్: గీతం విశ్వవిద్యాలయంలో బుధవారం భారతీయ విద్యా నాయకత్వ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి దేశ నలుమూలల నుంచి సీబీఎస్‌ఈ పాఠశాలలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ దాదాపు 200 మంది పాల్గొననున్నారు. ఉన్నత విద్యలో లిబరల్ ఆర్ట్స్,స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్)ను ఏకీకృతం చేసే చర్చల్లో పాల్గొనడానికి, వినూత్న విధానాలను రూపొందించడానికి ఈ సమావేశం ఒక వేదికగా ఉపయోగపడనుందని, మెరుగైన విద్యా పద్ధతుల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు నూతన ఆవిష్కరణలకు ఉదార విద్య, స్టెమ్ కోర్సులు ఎలా దోహదపడతాయి అనే అంశంపై ప్రముఖులు చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాల కోసం డాక్టర్ శివకుమార్ 9542424256/66ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి



సమావేశానికి హాజరైన కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు

రాయికోడ్(అందోల్): గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో ఉపాధిహామీ పనుల కొనసాగింపును వేగవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటేశం, ఏపీఓ రమేష్ ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో సోమవారం ఉపాధిహామి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మొక్కల పెంపకం కోసం నర్సరీల ఏర్పాటు పనులు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.


వరినారు పెంపకంలో మెలకువలు తప్పనిసరి

- దుక్కి దున్నడం నుంచి పంట సాగువరకు జాగ్రత్తలు పాటించాలి
- నారుమడిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి
- సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యతనివ్వాలి
- రైతులు సలహాలు పాటించాలని వ్యవసాయ అధికారుల సూచన

హత్నూర(సంగారెడ్డి): ప్రస్తుతం రబీ సీజన్ కావడంతో వరిసాగు కోసం రైతులు నారు పెంపకం చేపట్టారు. అయితే నారు పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సేంద్రియ ఎరువుల వాడకం, వరి నారు పెంపకంలో వివిధ రకాల మెలకువలు పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి వరప్రసాద్ రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్నారు.

పాటించాల్సిన మెలకువలు

- రైతులు మొదటగా నారు పెంపకం కోసం నారు మడిని బాగా దున్ని మూడుసార్లు దమ్ము చేసి చదును చేసుకోవాలి.
- నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా మడిలో కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.
- నారు నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు ఒకటి చొప్పున కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి.
- రెండు గుంటల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఎరువుతో పాటు పశువుల పేడ వేయాలి. సేంద్రియ ఎరువు కూడా వేసుకుంటే బాగుంటుంది.
- మొలక కట్టిన విత్తనాన్ని దుక్కిలో చల్లాలి. మొదట పలుచగా నీరు ఉంచాలి. జింకు లోపం సవరణకు లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి.
- వరినారు నాటు వేయడానికి సిద్ధంగా వచ్చిన సమయానికి వారం ముందు గుంట నారుమడికి 400గ్రాముల కార్బోరన్ 3జి గుళికలను ఇసుకలో కలిపి చల్లాలి. 15 రోజుల ముందు దమ్ము చేయాలి.



వరినారు మడి (ఫైల్)

- జీవన ఎరువులు అనగా అజోలా 150 కిలోలు, 50 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ పొలంలో వేసి మూడు వారాల పాటు పెరగనిచ్చి నేలలో వేసి కలియ దున్నాలి.

అధికారులను సంప్రదించాలి



వరినారు పెంపకంలో పైన పేర్కొన్న పద్ధతులను పాటించడం ద్వారా ఎకరాకు మూడు టన్నుల పచ్చిరొట్ట, 12కిలోల నత్రజని అందుతుంది. అంతేకాకుండా భూసారం పెరుగుతుంది. రైతులు పై విధంగా నియమాలు పాటిస్తే వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చు. పంటల సాగులో ఏవైన సమస్యలు తలెత్తితే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి.

– వరప్రసాద్, మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి

సమన్వయంతోనే సమస్యలు పరిష్కారం

- సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు ఇప్పిస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి హామీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): పార్టీలకతీతంగా నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. సిర్గాపూర్‌లో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు వివిధ సమస్యలను వివరించగా స్పందించిన ఎమ్మెల్యే సభ్యులు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్‌లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గం అభివృద్ధికి సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డిని పీఆర్‌ఎస్‌ఈ శ్రీహరీ, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాఘవరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాములు, ఎంపీడీఓ సుజాత, వైస్‌ఎంపీపీ ప్రయగబాయి, సర్పంచ్‌లు జంగం స్వప్న, రవిపాటిల్, ఎంపీటీసీ పీరప్ప, నాయకులు యాదవరెడ్డి, కల్యాణ్‌రావు, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు హెల్ప్‌కార్డులు పంపిణీ



హెల్ప్‌కార్డులు పంపిణీ చేస్తున్న చంద్రారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలోని అంబి మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ చంద్రారెడ్డి మంగళవారం హెల్ప్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలకు భరోసా కల్పించేందుకు ఈ హెల్ప్‌కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు. హెల్ప్‌కార్డులో 100 డయల్ నంబర్‌తో పాటు, అంబి మహిళా సేవా సమితి అధ్యక్షురాలి నంబర్ ఉంటుందన్నారు. మహిళలకు అండగా ఉంటున్న అంబి మహిళా సేవా సమితి అభివృద్ధికి, మహిళలకు అండగా ఉంటామని హామీనిచ్చారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన నాయకులను, అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు యాదిరెడ్డి, ఆనంద్‌కృష్ణారెడ్డి, రాజ్‌గోపాల్, దిననాథ్, ప్రవీణ్‌రెడ్డి, గోపాలమ్మ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిశీలన



వట్‌పల్లిలో ప్రభుత్వం స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 10లో ఉన్న ప్రభుత్వ భూమిని మంగళవారం డిప్యూటీ తహసీల్దారు శంభిరెడ్డి, సర్వేయర్ నర్సింహులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మండలానికి ప్రభుత్వ శాఖల భవనాలు మంజూరైతే.. వాటి నిర్మాణాలకు అవసరమైన స్థలం కోసం ప్రభుత్వ భూమిని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకట్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపల్లి గ్రామ శివారులో..

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 181లో ప్రభుత్వ భూమిని సర్వేయర్ రామభద్రతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ 181 సర్వే నెంబర్‌లోని 20 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇట్టి స్థలంలో ఎవరైన అక్రమ కట్టడాలు, భూకబ్జాకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రేషన్‌కార్డులు పంపిణీ చేయండి

కంది(సంగారెడ్డి): అర్హులైనవారందరికీ రేషన్ కార్డులు అందజేయాలని సీపీఐ మండల నాయకులు ఎంఎ. ఖాజా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ కార్డులకోసం పేదలు దరఖాస్తులు చేసుకొని ఏండ్లు గడుస్తున్నా గత ప్రభుత్వం మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రేషన్‌కార్డులను అందజేసి ఆదుకోవాలని కోరారు.

అనుమతి లేకుండా ఫ్యాక్టరీ నిర్మాణమా?

వివరణ ఇవ్వాలని మెదక్ డీపీఓ, శివంపేట పీఎస్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: అనుమతి లేకుండా ఫ్యాక్టరీ నిర్మాణం, అనధికారికంగా మంజీరా నీటి వినియోగంపై తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని మెదక్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), శివ్వంపేట్ పంచాయతీ సెక్రటరీ(పీఎస్)ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది. శివంపేట్‌లోని సర్వే నంబర్ 201, 203, 220, 221, 222, 226, 227, 228లో స్కోల్ బ్రూవరీస్ లిమిటెడ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి అనధికారికంగా మంజీరా నీటిని వినియోగించుకుంటోందని, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టిన సంస్థపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మెదక్ జిల్లా పుల్కల్ మండలం శివంపేట్‌కు చెందిన కె.మల్లికార్జున గౌడ్, మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పంచాయతీరాజ్ చట్టాన్ని ఉల్లంఘించి సంస్థ వ్యవహరిస్తున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం డీపీవో, పీఎస్‌లకు నోటీసులు జారీ చేసింది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన శివకుమార్, భార్య జని వైష్ణవితో కలిసి బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ వచ్చి సాయితేజ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ఇంటికి వాచ్‌మెన్‌గా ఉన్నారు. ఈ నెల 11వ తేదీ ఉదయం రోజు మాదిరిగానే నిర్మాణ దశలో మూడో అంతస్తులో గోడలకు నీళ్లు కొట్టేందుకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన భర్త శివకుమార్ స్థానికుల సహకారంతో చికిత్స నిమిత్తం ఇస్నాపూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పటాన్‌చెరు పట్టణంలోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని కారు ఢీ..

- వ్యక్తికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐటీ డబ్ల్యూ సిగ్నోడు కాలనీలో ఉండే లక్ష్మణ్ వద్దకు సిర్గాపూర్ నుంచి తన బామ్మర్ది రమేష్ బైక్‌పై సోమవారం వచ్చాడు. తిరిగి వెళ్తుండగా రాత్రి 11గంటల సమయంలో గుర్తుతెలియని కారు వచ్చి రమేష్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన రమేష్‌ను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బావ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మెట్టు కుమార్‌యాదవ్‌కు సన్మానం



కార్పొరేటర్ కుమార్‌యాదవ్‌కు శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరిస్తున్న కాలనీవాసులు

పటాన్‌చెరు టౌన్: కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌ను సింఫనీ కాలనీవాసులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షురాలు రేఖ మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్పొరేటర్ కుమార్‌యాదవ్ కాలనీలో పర్యటించిన సమయంలో కాలనీలో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరగా ఎన్నికలు పూర్తయిన వెంటనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు సింఫనీ కాలనీలో పేరుకుపోయిన చెత్త, చెదారం, పలుచోట్ల పిచ్చిమొక్కలను తొలగింపచేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్‌ను సన్మానించి శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరించారు.

భక్తిశ్రద్ధలతో రుద్రహోమం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెంలో శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా మాజీ ఆలయ కమిటీ చైర్మన్ గటాటి భద్రప్ప ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా రుద్రహోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్, ఆలయ నిర్వాహకుడు సోమయ్య, భక్తులు పాల్గొన్నారు.

వీరభద్రేశ్వర ఆలయంలో పూజలు

రాయికోడ్(అందోల్): కార్తీకమాసం ముగింపు, అమావాస్య సందర్భంగా రాయికోడ్‌లోని వీరభదేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్‌పాటిల్, సిబ్బంది, పురోహితులు కృష్ణ, వీరయ్యస్వామి, బస్వరాజ్‌స్వామి, శివకుమార్‌స్వామి, రుద్రయ్యస్వామి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

జహీరాబాద్ టౌన్: నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి వచ్చిన సేవాలాల్ బంజార శక్తిపీఠ్ పాదయాత్రీకులకు మాజీ డీసీసీబీ అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి మంగళవారం అన్నదానం నిర్వహించారు. అనంతరం కర్ణాటక రాష్ట్రంలోని గణగాపూర్ దత్తాత్రేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనుల గురువు రాంరావ్ మహారాజ్ శిష్యులు బలిరాం మహారాజ్, సద్గురు కరుణ్ గజేంద్ర భారతీ మహారాజ్‌ల ఆశీస్సులు పొందారు. ఆయన వెంట నాయకులు జనార్ధన్‌రెడ్డి, శివాజీపాటిల్, ఏకనాథ్‌పాటిల్, సుదీర్ బండారీ, బుచ్చిరెడ్డి, సురేష్ పురి, రామకృష్ణగౌడ్, శశివర్ధన్‌రెడ్డి అఫ్సార్ దిల్‌దార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

నారాయణఖేడ్: పట్టణంలోని కల్పనా హనుమాన్ ఆలయంలో భవానీ శంకర కల్యాణోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖండ హరినామ సప్తహాతో పాటు వివిధ పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమరెడ్డి, వేద పండితులు మోహన్ జ్యోషి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్, బీజేపీ, బీజేవైఎం నాయకులు పూజలు నిర్వహించారు. అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్, ఏకాంబ పీఠాధిపతి అవదూత్ మహారాజ్, బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్వేశ్వర్ పాల్గొన్నారు.

మంత్రి దామోదరకు సన్మానం



వట్‌పల్లి(అందోల్): రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను వట్‌పల్లి మండల పరిధిలోని షాద్‌నగర్(గట్‌పల్లి)కి చెందిన సర్పంచ్ రమేశ్ మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దామోదర రాజనర్సింహ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.